Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143






Editor : Dama Vijaya Kumar | Volume : 2 | issue: 43 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 2 | సంచిక :43 | శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 | వెల : 3 | పేజీలు : 4




## ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ

విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న మంత్రి లోకేశ్

విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు

పారిశ్రామికవేత్తల నుంచి కప్ టీ, కేక్ తప్ప ఏమీ తీసుకోలేదని వెల్లడి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

"నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి - మిగతా3లో

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా సచివాలయాల

# పేరు మార్పునకు పచ్చజెండా

- సచివాలయాల పేరు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మార్పు
- కేబినెట్ ఆమోదించిన అంశాలు ఇవే!
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- పలు కీలక నిర్ణయాలకు ఆమోదం
- నీటిపారుదలశాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

సోలార్ ఎనర్జీ కింద తీసుకునే అసైన్డ్ భూములను ఎకరాకు ఏడాదికి 30 వేలు కౌలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా సచివాలయాల పేరు మార్పునకు పచ్చజెండా ఊపింది. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం సమావేశంలో24 అజెండా అంశాలకు ఆమోదం లభించింది. సోలార్ ఎనర్జీ కోసం తీసుకునే అసైన్డ్ భూములకు ఎకరాకు ఏడాదికి 30 వేలు రూపాయలు, 2 ఏళ్లకు 5 శాతం పెంచేలా మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా సచివాలయాల పేరు మార్పునకు పచ్చజెండా ఊపింది. నీటిపారుదల వనరులకు 7 వేల 189 నిర్వహణ పనులకు కేబినెట్ పరిపాలనా ఆమోదం తెలిపింది. భూములు బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఆమోదం లభించింది. గాజువాక రెవెన్యూ పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో 6 నెలలు పొడిగించేందుకు - మిగతా3లో

## సవాళ్లు-ప్రతిసవాళ్లతో

# దద్దరిల్లిన మండలి



- గవర్నర్ ప్రసంగంపై వాడీవేడి చర్చ
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో వాడీ వేడీ చర్చ
- తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడిన టీడీపీ ఎమ్మెల్సీలు
- గవర్నర్‌పై దాడి చేయాలని ప్రయత్నించడం క్షమించరాని చర్య అని వెల్లడి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గవర్నర్ ప్రసంగంపై ధన్యాదాలు తెలిపే తీర్మానంపై శాసన మండలిలో అధికార, విపక్షాల మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. పరస్పరం సవాళ్లు ప్రతిసవాళ్లతో సభ దద్దరిల్లింది. గవర్నర్ ప్రసంగంలోని అంశాలపై వైఎస్సార్సీపీ సభ్యులు విమర్శలు చేయగా ఆరోపణలను అధికారపార్టీ సభ్యులు దీటుగా తిప్పి కొట్టారు. ఆరోపణలు నిరూపించేందుకు తాము సిద్ధమని వైఎస్సార్సీపీ సభ్యులు సవాల్ విసరగా, దమ్ముంటే నిరూపించాలని దీనికి తాముసైతం సిద్ధమని అధికారపార్టీ నేతలు ప్రతిసవాల్ విసిరారు. ప్రశ్నోత్తరాల అనంతరం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు చర్చ చేపట్టారు. తొలుత ప్రసంగించిన ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని గవర్నర్ ప్రసంగంలోనూ ఇది ప్రస్ఫుటమైందని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల సాధన, పెట్టుబడుల సాధన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి దాడులు నిత్యకృత్యంగా చేశారని. వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు వేధింపులకు పాల్పడేవారని ఇంకా దళితులను చంపి - మిగతా3లో



## ఏపీలో సరికొత్త

# వైద్య సేవలు!

అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు..

సరైన రవాణా సదుపాయం లేని గ్రామాలకు ప్రాణదాతలుగా డ్రోన్లు

20 నిమిషాల్లోపే అత్యవసర మందుల సరఫరా

రెడ్ వింగ్ సంస్థతో కలిసి ఏపీ ప్రభుత్వం సరికొత్త సేవలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గిరిజన ప్రాంతాల్లోని పేదలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేసే దిశగా సరికొత్త సాంకేతిక విప్లవానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'సంజీవని' మెడికల్ డ్రోన్ల పైలట్ ప్రాజెక్టును అల్లూరి సీతారామరాజు జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుకుని ఆసుపత్రులకు వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఈ డ్రోన్లు ప్రాణదాతలుగా మారాయి. అల్లూరి జిల్లాలోని 2,191 గిరిజన గ్రామాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో... అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను డోలీల ద్వారా కిలోమీటర్ల దూరం - మిగతా3లో

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా



- కొత్తగా 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన రక్షణ శాఖ
- కాంబాట్ క్షిపణుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్
- కాంబాట్ క్షిపణులు, ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ల కొనుగోలుకు అనుమతి



## ఆదాయ పన్ను వసూళ్లు పెరగడం అంటే మధ్యతరగతి ప్రజలను అణచివేస్తున్నట్లు కాదు

- నిర్మలా సీతారామన్
- 2026–27 బడ్జెట్‌పై రాజ్యసభలో చర్చించిన కేంద్ర ఆర్థిక మంత్రి
- బడ్జెట్‌పై విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టిన నిర్మలా
- పన్ను వసూళ్ల పెరుగుదల ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు నిదర్శనమని వెల్లడి



## అమెరికా ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు

- వాణిజ్య ఒప్పందంపై భారత్ కీలక ప్రకటన
- భారత్– యూఎస్ ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు
- దీనిపై స్పందించిన భారత్
- ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ అమలుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని వెల్లడి

## అసెంబ్లీలో బాలకృష్ణుడికి శ్రీకాళహస్తి మహాశివరాత్రి ఆహ్వానం



**అమరావతి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 12:** రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అమరావతి గురువారంరోజు అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే, అభిమాన నటుడు నందమూరి బాలకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. బాలయ్య బాబుతో గడిపిన సమయం ఉత్సాహకరమని, ప్రజా సమస్యలపై ఆయన చూపే పోరాట చొరవ, ధైర్యం అందరికీ స్ఫూర్తిదాయకమని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.

## లోబావి భరద్వాజ తీర్ధంలో చాపల మృతి

### దుర్గంధంతో ఇబ్బందిపడుతున్న భక్తులు, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి12:** శ్రీకాళహస్తిలోని లోబావి భరద్వాజ తీర్థంలో పెద్ద సంఖ్యలో చాపలు మృతిచెందడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ పరిస్థితి వల్ల భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పవిత్ర తీర్థ ప్రాంతంలో ఇలా అపరిశుభ్రత నెలకొనడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై దేవస్థానం అధికారులు వెంటనే స్పందించి మృతిచెందిన చాపలను తొలగించి, నీటిని శుద్ధి చేయడంతో పాటు పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

### కుప్పంలో నెట్ జీరో పైలట్ ప్రాజెక్టుగా

## 5,555 ఈ–సైకిళ్ల పంపిణీ





**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి12:** రాష్ట్రంలో నెట్‌జీరో లక్ష్యంతోకుప్పం ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా 5,555 ఈ–సైకిళ్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పంపిణీ చేశారు. అందులో భాగంగా ద్రావిడ విశ్వవిద్యాలయంలో పరిపాలన సౌలభ్యం కోసం రెండు ఈ–సైకిళ్లను కొనుగోలు చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యం. దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ ఈ సైకిళ్లను ప్రారంభించి, భద్రతా సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకువచ్చారు

### శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు

## భారీ బందోబస్తు డిఎస్పి ఎన్ఎస్ మూర్తి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి12;** శ్రీకాళహస్తి శ్రీకాళహస్తిలో జరుగుతున్న మహాశివరాత్రివార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని అధికారుల సహాయ సహకారాలతో విజయవంతంగా కొనసాగించాలం టూ శ్రీకాళహస్తి డిఎస్పి ఎన్ఎస్ మూర్తి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి ఎన్.ఎస్ మూర్తి మాట్లాడుతూ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని ఈ పర్యాయం 950 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మహాశివరాత్రి నాడు వచ్చే విఐపి లకు వారికి ఏర్పరిచేసిన సమయంలోనే వీఐపీల దర్శనం నిర్వహింప బడుతుందన్నారు. సామాన్య భక్తులకు మొదట స్వామి వారి దర్శనం అయ్యేవిధంగా కార్యచరణ చేపడుతున్న అన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సంబంధిత అధికార యంత్రాంగంతో ఇప్పటికే పూర్తి కార్యాచరణ చేపట్టామని, లాడ్జీ యాజమాన్యాల సిబ్బందికి ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసాము. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. మహాశివరాత్రి నాడు ఆలయం లోపల ఏమైనా భక్తులకు ఎక్కడ భక్తులకు ఇబ్బందులు జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు. రథోత్సవం నాడు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు జరగకుండా ప్రత్యేక డౌన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాము అని అన్నారు. ప్రత్యేక పోలీస్ సిబ్బంది, ముఫ్టీలో క్రైమ్ సిబ్బంది ఏర్పాటు చేసి వారు ప్రజలలో కలిసిపోయి ప్రజలను గమనిస్తూ ఉంటారని ఎక్కడైనా ఎటువంటి అవాంఛనీయ సంఘాలు జరిగినా అవాంఛనీయ సంఘటనలు చేసిన వారిని వెంటనే వారిని అదుపులో తీసే విధంగా కార్యాచరణ చేపట్టను నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎన్.ఎస్ మూర్తి, వన్ టౌన్ సీఐ జి ప్రకాష్ కుమార్, సీఐ సంజీవ్ కుమార్, తొట్టంబేడు సీఐ తిమ్మయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

చదవండి.. చదివించండి

చిత్తూరు ఎక్స్‌ప్రెస్

# బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

### ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి12:** శ్రీకాళహస్తి డా.బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రగతి సంస్థ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తిలో దేవుడి పెళ్లి రోజున ప్రతి యేటా సామూహిక వివాహాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆది దంపతులకు పెళ్లి జరిపే రోజు వివాహాలు జరిగితే ఆ జంటలు కలకాలం ఆనందంగా, అన్యోన్యంగా ఉంటాయని ప్రజల విశ్వాసం. కానీ ఈ పర్వదినాన బాల్య వివాహాలు చోటు చేసుకోవడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. మన నమ్మకాలకు, విశ్వాసాలకు అమూల్యమైన బాల్యాన్ని బలి ఇవ్వడం బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరం. బాల్య వివాహలకు పాల్పడితే కుటుంబ సభ్యులు, బంధువులు, పూజారి మొదలు క్యాటరింగ్ చేసిన వారి వరకు ప్రతి ఒక్కరూ శిక్షార్హులే. 2009 నుంచి మాస్ మ్యారేజెస్ సందర్భంగా బాల్య వివాహల నిర్మూలన కొరకు ప్రగతి సంస్థ చేస్తున్న కృషి గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. శివరాత్రి దేవుడి పెళ్లి, సామూహిక వివాహాల సమయంలో పట్టణం నలుమూలలా చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి గవర్నమెంట్ డిపార్టుమెంటులతో కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపివో శాంతి దుర్గ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకుంటే కలిగే అనర్థాల గురించి అంగన్వాడి సేవలు గురించి వివరించారు. మెడికల్ ఆఫీసర్ శివకుమార్ మాట్లాడుతూ బాల్య వివాహల వల్ల కలిగే ఆరోగ్య పరమైన, మానసిక సమస్యల గురించి, టీనేజి ప్రెగ్నెన్సీ గురించి, మాతా శిశు మరణాలు గురించి వివరించారు. ప్రిన్సిపాల్ మాధవిలత మాట్లాడుతూ చిన్న వయసులో ఆకర్షణలకు లోనై బాల్య వివాహాల బారిన పడకుండా పిల్లందరూ చక్కగా చదువుకుని పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చి ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. ఈ సందర్భంగా టూ టౌన్ సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలపై వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి బాల్య వివాహాలపై ఉపేక్షించేది లేదు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రగతి సంస్థ సిబ్బంది లక్ష్మి నారాయణ, చంద్రశేఖర్, జయలక్ష్మి, బోస్, ప్రభాకర్ రాజేశ్వరమ్మ, సుమలత, కోటయ్య, లత, మోహన్ బాబు మొదలగు వారు పాల్గొన్నారు.

## కేఈసీలో ఘనంగా ఐఈఈఈ శాఖా నాలుగు అధ్యాయాల ప్రారంభం




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 12:** కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వ హించిన అవగాహన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాలు, నూతన టెక్నాలజీలపై విశేష అవగాహన కల్పించబడింది. ఈ క్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డా. సునీల్ రాజ్ ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి,ఐఈఈఈ యొక్క ఔన్య త్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సుధాకర్ బాబు మాట్లాడుతూ పిల్లలు మార్కుల కోసం తపనే కాకుండా కో కరికులార్ అంశాల్లో చురుగ్గా పాల్గొని తమ కొత్త పరిశోధనలు చేయాలయని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా.వి.జయ ప్రకాశన్,ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్, డా.చెన్నం హరనాథ రెడ్డి,ఐఈఈఈ అనంతపురం సబ్ సెక్షన్ వారు పాల్గొన్నారు. వీరు విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగాలు, ఐఈ ఈఈ సొసైటీ/అధ్యాయాల ప్రస్తుతకాలంలో ఎంత అవసరమో తెలియచేశారు. విద్యార్థులకు కంప్యూటర్ కమ్యూనికేషన్ గురించి టెక్నికల్ టాక్లో తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.జి.ఎన్ కోదండరామయ్య ఆర్అండ్‌డి డైరెక్టర్ ఈ.సీ.ఈ విభాగాధిపతి, ఐఈఈఈ కోఆర్డినేటర్లు డా.రాసదొరై, డా.అజయ్ కుమార్‌రెడ్డి, వివిధ విభాగాధిపతిలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శివరాత్రి ఏర్పాట్లపై డిపిటిఓ ఆకస్మిక తనిఖీ

### కుప్పం డిపోలో సౌకర్యాలపై ఆదేశాలు




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి12:** మహాశివరాత్రి సందర్భంగా చిత్తూరు డిపిటిఓ గురువారం నాడు కుప్పం ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కుప్పం బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. బస్ స్టేషన్‌లోని మరుగుదొడ్లను స్వయంగా తనిఖీ చేసిన డిపిటిఓ, ప్రతిరోజూ శుభ్రత పాటించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రయాణికులకు త్రాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అదేవిధంగా బస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రతిరోజూ క్లీనింగ్, స్వీపింగ్ పనులు నిరంతరంగా జరిగేలా పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు. తదుపరి కుప్పం గ్యారేజీని సందర్శించిన డిపిటిఓ, బస్సుల బ్రేక్‌డౌన్‌లు తగ్గించేందుకు మెయింటెనెన్స్ పనులను కచ్చితంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. బస్సుల ఫెయిల్యూర్లపై సిబ్బందితో చర్చించి, సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మెయింటెనెన్స్ పూర్తి చేసిన ఒక బస్సును సిబ్బందితో కలిసి రోడ్డు పరీక్ష నిర్వహించి, పనితీరును సమీక్షించారు. అలాగే శివరాత్రి పర్వదినాన మల్లప్పకొండలో నిర్వహించనున్న జాతర దృష్ట్యా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ఆర్టీసీ కుప్పం డిపో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి12:** ' కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు రసాయన శాస్త్ర విభాగం వారు నిర్వహించిన 2 రోజుల జాతీయ సదస్సులో "క్రోమాటోగ్రఫీ మరియు స్పెక్ట్రోస్కోపీని ఉపయోగించి ఔషధ సమ్మేళనాల విశ్లేషణ" అనే అంశం పై ఔషధరంగంలో విపరీతంగా వచ్చిన వినూత్న మార్పులను గురించి వివరించడం జరిగింది. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ వారి ఆర్థిక సహకారంతో బ్లాక్‌బక్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో నిర్వహించిన సదస్సు రసాయన శాస్త్రంలో నూతన పరిశోధనలను ఆవిష్కరించడానికి గొప్ప బాట వేస్తుందని కళాశాల ప్రిన్సిపల్ ఎల్ బి ప్రదీప్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎం ఉషా కో ఆర్డినేటర్ వి.నారాయణమూర్తి, సదస్సు రిసోర్స్ పర్సన్ డా గిరీష్, వైస్ ప్రిన్సిపాల్ డా సి రాజ్యలక్ష్మి, డా మాధవి, నమ్రత, డా ఏ చంద్రబాబు, పద్మావతి దేవి రాష్ట్రంలోని వివిధ కళా శాల నుండి వచ్చిన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, కళాశాలలోని అధ్యాపక అధ్యాప కేతర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉనిషిగానిపల్లిలో రైతులకు యూరియా పంపిణీ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 12:** రామకుప్పం మండలం ఉనిషిగానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రైతులకు యూరియా ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సరైన సమయంలో ఎరువులు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ రామమూర్తి మాట్లాడుతూ, రైతులు ఎరువులను సరైన మోతాదులో, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కో–క్లస్టర్ ఇంచార్జ్ శంకర్ చలం రైతులకు అందుబాటులో ఉన్న పథకాల గురించి వివరించారు. వైస్ ఎంపీపీ వెంకటరమణ గౌడు రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పంచాయతీ అధ్యక్షులు మానేష్ నాయుడు మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్ర నాయుడు, కృష్ణారెడ్డి, రామలింగం, గోపాల్ రెడ్డి, లోకేష్, కేశవులు, బీరప్ప, నవీన్, గోపి తదితరులు పాల్గొని రైతులకు యూరియా సంచులను పంపిణీ చేశారు. రైతులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చవటకుంట పీఏసీలో షాపింగ్ కాంప్లెక్స్



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి12:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ గంగాధర నెల్లూరు శాసనసభ్యుల సూచనల మేరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం చవటకుంట పీఏసీలో శాశ్వత భవన నిర్మాణానికి వాణిజ్య విభాగం కోసం షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, దానికి కావలసిన నగదు డిస్ట్రిక్ట్ సెంట్రల్ బ్యాంక్ నుంచి మంజూరు చేయాలని చవటకుంట పీఏసీ చైర్మన్ బోడి రెడ్డి సుధాకర్‌రెడ్డి మనస్ఫూర్తిగా కోరారు.పీఏసీలో శాశ్వత భవనం నిర్మాణం పూర్తయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన చైర్మన్ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ గౌరవ గంగాధర నెల్లూరు శాసనసభ్యులు, డాక్టర్ వి.ఎం. థామస్ సూచనలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని, ఇది స్థానిక ప్రజలకు వాణిజ్య అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పీఏసీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# సవాళ్లు-ప్రతిసవాళ్లతో దద్దరిల్లిన మండలి

-మొదటిపేజీ తరువాయి

డోర్ డెలివరీ చేసే వారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ల్యాండ్, శాండ్, మైనింగ్ మాఫియాలు విచ్చలవిడిగా చెలరేగాయని అన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక సాయం చేస్తున్నామని, అమరావతిని గత ప్రభుత్వం నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తోందన్నారు.

కనీసం లాయర్‌నూ నియమించలేదు: కూటమి ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధి సంక్షేమాన్ని గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా తెలియజేశారని, గవర్నర్‌పై దాడి చేయాలని వైఎస్సార్సీపీ సభ్యులు ప్రయత్నించడం క్షమించరాని చర్య అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని వినలేని వారు వారానికోసారి ఆయన వద్దకు ఎందుకు వెళ్తున్నారో వైఎస్సార్సీపీ నేతలు చెప్పాలని నిలదీశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చి చిరకాల వాంఛ నెరవేర్చిందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోనే ఎన్జీటీ స్టే ఇచ్చిందని, ప్రాజెక్టు స్టే ఎత్తేందుకు కనీసం మంచి లాయర్‌ను కూడా వైఎస్సార్సీపీ ప్రభుత్వం నియమించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖరరెడ్డి పలు ఆరోపణలు, విమర్శలు చేయడంతో శాసన మండలి వేడెక్కింది. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య పరస్పరం మాటల యుద్ధం, సవాళ్లు ప్రతి సవాళ్లకు దారి తీసింది. తల్లికి వందనం కింద విద్యార్థి తల్లికి ఏటా రూ.15,000 జమ



చేస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేశారన్న చంద్రశేఖరరెడ్డి ఆరోపణలపై మంత్రి పార్థసారథి తప్పు పట్టారు. గవర్నర్ ప్రసంగంలో అపద్దాలు చెప్పించారని, రైతులకు ఎవ్వరికీ రూ.20,000 పూర్తి మొత్తం చెల్లించలేదని ఒక్క ఏడాదైనా రూ.20,000 ఇచ్చినట్లు రుజువు చేస్తే తాము క్షమాపణలు చెబుతామని మంత్రి పార్థసారథి అన్నారు.

అన్ని అబద్దాలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. మాట తప్పం మడమ తిప్పమన్న గత ప్రభుత్వం ఇద్దరికి ఇస్తామని ఒక్కరికే అమ్మఒడి ఇచ్చిన సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20,000 ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రైతులకు రూ.7,000 మాత్రమే ఇచ్చిందన్న మంత్రి, రైతులకు ధాన్యం డబ్బులు ఎగ్గొట్టినందుకు వైఎస్సార్సీపీ నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.

**ఏ శిక్షకైనా సిద్ధం**

చర్చ సందర్భంగా విపక్ష నేత బొత్స జోక్యం చేసుకోవడంతో మంత్రి పార్థసారథి దీటుగా జవాబిచ్చారు. బొత్స, మంత్రి పార్థసారథి మధ్య మాటకు మాట దారి తీసింది. పరస్పరం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వం ఎవరికీ పూర్తిగా రూ.15,000 ఇవ్వలేదని, 63 లక్షల మందిలో కేవలం 15 శాతం మందికే తల్లికి వందనం కింద కేవలం రూ.7 నుంచి 8 వేలు మాత్రమే చెల్లించారని బొత్స ఆరోపించారు. నియోజకవర్గంలోనూ తల్లికి వందనం కింద పూర్తి డబ్బు చెల్లించలేదని సవాల్ చేసిన బొత్స సభను తాను తప్పుదోవ పట్టించినట్లు రుజువు చేస్తే మాటలు విత్ డ్రా చేసుకుని క్షమాపణ చెబుతానన్నారు. బొత్స ఆరోపణలను దీటుగా తిప్పికొట్టిన మంత్రి పార్థసారథి ఆరోపణలను ఖండించారు. బొత్స చేసిన చేసిన ఛాలెంజ్‌ను స్వీకరించేందుకు మేము సిద్ధమని 15 శాతం మందికే చెల్లించినట్లు తేలిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు.

సభ రేపటికి వాయిదా: అనంతరం ప్రసంగాన్ని కొనసాగించిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరు మార్చారని, రద్దు చేయలేదని అన్నారు. ఈ వ్యాఖ్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్ తప్పుపట్టారు. వైఎస్సార్సీపీ సభ్యులు చాలా తేలిగ్గా అబద్దాలు చెబుతున్నారన్న మంత్రి, వైఎస్సార్సీపీ సభ్యులు సభలో అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని పూర్తిగా రద్దు చేసిన విషయాన్ని తెలుసుకుని మాట్లాడాలన్నారు. సభ్యుల మధ్య వాద-ప్రతివాదనలు, సవాళ్లు-ప్రతి సవాళ్లు కొనసాగుతుండగానే సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ కొయ్యె మోషేను రాజు ప్రకటించారు. రేపు ప్రశ్నోత్తరాల అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగనుంది.

# వైసీపీ మౌనం - వ్యూహమా? వైఫల్యమా



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడానికి సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మార్చి 9 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ తరుణంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పా అనుసరిస్తున్న మౌనం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న దాఖలాలు కనిపించక పోవడంతో, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించినట్లే.. ఇప్పుడు కూడా అదే బాటలో నడుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సూచనలు రాగానే అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంపై పార్టీలు కసరత్తు చేస్తాయి. కానీ వైసీపీలో ప్రస్తుతం అటువంటి సందడి ఎక్కడా కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత క్యాడర్‌ను తిరిగి సమీకరించడంలో నాయకత్వం కొంత తడబడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార కూటమి దూకుడుగా ఉండటం, పోలీసులు , అధికార యంత్రాంగంపై తమకు నమ్మకం లేదని గతంలోనే పార్టీ ప్రకటించినందున , పోటీకి దూరంగా ఉండటమే మేలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఎన్నికలను బహిష్కరిస్తే పరువు దక్కుతుందనేది ఒక వాదన అయితే, అది పార్టీ మనుగడకే ముప్పు అనే సంకేతాలు క్షేత్రస్థాయి నుంచి అందుతున్నాయి. స్థానిక ఎన్నికలు అంటే కేవలం పార్టీ గెలుపోటములే కాదు, గ్రామాల్లో నాయకులు తమ ఉనికిని కాపాడుకునే అవకాశం. ఒకవేళ పార్టీ పోటీ చేయకపోతే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా అనాథలయ్యే ప్రమాదం ఉంది. పోటీలో లేకపోతే క్యాడర్ నిరుత్సాహపడి, తమ రాజకీయ భవిష్యత్తు కోసం అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే అవకాశం ఉంది.రాజకీయాల్లో మైదానం వదిలి వెళ్లడం ఎప్పుడూ సరైన సంకేతం కాదు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ గ్రాఫ్ తగ్గుతూ వస్తోందని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్న తరుణంలో, స్థానిక ఎన్నికల నుంచి తప్పుకోవడం ఆ ప్రచారానికి బలం చేకూర్చినట్లు అవుతుంది. ఎన్నికల్లో ఓడినా పోరాడామనే ముద్ర ఉంటే భవిష్యత్తుపై ఆశ ఉంటుంది, కానీ పోటీనే చేయకపోతే పార్టీ బలహీనపడిందనే ముద్ర శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీ నుంచి వలసలను ప్రోత్సహించడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ యంత్రాంగాన్ని దెబ్బతీస్తుందన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. వైసీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఖండించి, కేడర్‌లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూనే, ప్రజాక్షేత్రంలో పోరాటం చేయడం ద్వారానే కోల్పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవచ్చు. పరీక్షల లోపే ఎన్నికలు పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు తగ్గట్టుగా, పార్టీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. లేనిప క్షంలో, ఈ స్థానిక ఎన్నికలు వైసీపీ ఉనికికి పెద్ద పరీక్షగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది.

**ఎమ్మెల్సీ ఎన్నికలు బాయ్ కాట్**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో, గ్రామ పంచాయతీల గడువు ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేశాయి. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సంకేతాలు రాగానే పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంతో సందడి నెలకొంటుంది. కానీ, వైసీపీ క్యాంపులో కనిపిస్తున్న నిశ్శబ్దం పలు అనుమానాలకు తావిస్తోందిగతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలోనూ పార్టీ నాయకత్వం అదే ఆలోచనలో ఉందన్న ప్రచారం సాగుతోంది. ఇందుకు అనేక కారణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసులు, అధికార యంత్రాంగం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వరని వైసీపీ ఆరోపిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇంకా కోలుకోలేదు. ఆర్థికంగా, సామాజికంగా దాడులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎన్నికల బరిలోకి దిగడం సాహసమేనని కొందరు భావిస్తున్నారు. ఓడిపోతే వచ్చే పరాభవం కంటే, వ్యవస్థలపై నిరసనగా పోటీకి దూరంగా ఉన్నామని చెప్పడం ద్వారా పార్టీ పరువు కాపాడుకోవచ్చనేది కొందరి వాదన.రాజకీయాల్లో 'మైదానం వదిలి వెళ్లడం' అంటే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడమే. స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కావు, అవి పార్టీ గ్రామస్థాయి ఉనికిని చాటుకునే అవకాశం కల్పిస్తాయి. పార్టీ పోటీ చేయకపోతే దశాబ్దాలుగా జెండా మోసిన కార్యకర్తలు రాజకీయంగా అనాథలవుతారు. తమ ఉనికి కోసం వారు అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే ప్రమాదం ఉంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో, ఎన్నికల నుంచి తప్పుకుంటే పార్టీ పూర్తిగా బలహీనపడిందనే ముద్ర పడుతుంది. ఇది పార్టీ నుంచి భారీ వలసలకు దారితీసే అవకాశం ఉంది.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. పోరాటం చేయకుండా తప్పుకోవడం వల్ల వైసీపీకి దీర్ఘకాలికంగా నష్టమే జరుగుతుంది. ఓడినా పోరాడామనే ముద్ర ఉంటేనే క్యాడర్‌లో భవిష్యత్తుపై ఆశ చిగురిస్తుంది. వైసీపీ నాయకత్వం అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతూనే, ప్రజాక్షేత్రంలో గట్టిగా నిలబడాలి.మార్చిలో జరగబోయే ఈ స్థానిక ఎన్నికలు వైసీపీకి ఒక "లిట్మస్ టెస్ట్" లాంటివి. ఈ పరీక్షలో పోటీ చేసి ఉనికిని చాటుకుంటుందో లేక బహిష్కరణ పేరుతో వెనకడుగు వేస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో వైసీపీ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.

# పోర్టు రాకతో మచిలీపట్టణానికి మహర్ధశ

**విజయవాడ :** మచిలీపట్నం రూపురేఖలు మారబోతున్నాయి. అక్కడ కొత్తగా షిప్ బిల్డింగ్, రిపేర్ల కోసం సెంటర్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం మారిటైమ్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మచిలీపట్నంలో షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం పలు సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అనుకున్నట్లుగానే మచిలీపట్నం వాసుల కల నెరవేరనుందని జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయంటున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జివోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

-మొదటిపేజీ తరువాయి

మోసుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

## ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.

**మండలిలో భూ కేటాయింపులపై వాడీవేడి చర్చ**

శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

**విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి**

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిజూ), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

**ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం**

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

**హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం**

విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్**

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

**విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం**

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం**

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా సచివాలయాల పేరు మార్పునకు పచ్చజెండా

-మొదటిపేజీ తరువాయి

అనుమతించింది. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అనధికార ఇళ్ల క్రమబద్ధీకరణ గడువును జూన్ 30 వరకు పెంపునకు ఆమోదం తెలిపింది. ఏలూరు జిల్లా తోటపల్లిలో 45.6 ఎకరాల ప్రభుత్వ భూమిని కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లా సంజామల మండలం నోస్సంలో 250 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టు కోసం 1,500 ఎకరాలు భూమిని ఎకరాకు ఏడాదికి 31 వేల రూపాయల చొప్పున ఇచ్చేందుకు పచ్చజెండా ఊపింది. ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో ఏపీఎస్‌డీసీ కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అమరావతి మెరినా అభివృద్ధికి పీపీపీ విధానంలో 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన టెండర్లకు ఆహ్వానించాలని కేబినెట్ నిర్ణయించింది. యాగంటిలో 1000 మెగావాట్లు, రాజుపాలెలంలో 800 మెగావాట్ల ప్రాజెక్టులకు ఏపీ జెన్కో స్వతంత్రంగా అమలు చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మంత్రివర్గం ముగిసిన తర్వాత తాజా రాజకీయ పరిణామాలు, వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో మాట్లాడారు. సభలో మంత్రుల జవాబులు క్లుప్తంగా, అర్థమయ్యేలా ఉండాలని సూచించారు. శ్రీశైలంలో భక్తుల పట్ల పోలీసుల తీరుపైనా సీఎం స్పందించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. క్యూలైన్‌లో ఇబ్బందిపడుతున్న పెద్దవాళ్లను బయటకు తీసుకొస్తున్న సమయంలో వారిని వేరేదారిలో తీసుకెళ్తున్నట్లు భక్తులు భావించారని హోంమంత్రి అనిత వివరించారు. అటువంటప్పుడు పోలీసులు ముందే అనౌన్స్ చేస్తే బాగుండేది కదా అన్న సీఎం చంద్రబాబు విషయాన్ని భక్తులకు అర్థమయ్యే రీతిలో మైక్‌లో చెప్పి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. జలజీవన్ మిషన్ కింద ఏపీకి 12 వేల కోట్ల రూపాయలు విడుదలకు కేంద్రం అంగీకరించిందని చంద్రబాబు వెల్లడించారు. జలజీవన్ పనులు 3 ఏళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాల్లో జరుగుతున్న ప్రాజెక్టులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసే విధంగా ఇంఛార్జ్ మంత్రులు చూడాలని దిశానిర్దేశం చేశారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్



## సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న
# ఏపీఎస్‌డబ్ల్యూహెచ్ డి.రంగనాథ్



**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి11:**
వీ.కోట మండలం, కుంబార్లపల్లి గ్రామ పంచాయతీ గిస్తంపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీ ఎస్ గ్రాంట్ క్రింద మంజూరైన సిమెంట్ రోడ్ నిర్వహణలో భాగంగా సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణంలో పని నాణ్యత గురించి రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించినారు. గుత్తేదారుతో మాట్లాడుతూ, నాణ్యతలో లోపంఉండ కూడదని సిమెంటు ఇసుక నీరు కంకర ఎక్కడ కానీ తగ్గకుండా చూడాలని సూచించినారు. ఇతని వెంట గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మిక సంఘాల ఆధ్వర్యంలో
# సార్వత్రిక సమ్మె విజయవంతం



**పీలేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి12 :**
దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ, రైతు, విద్యార్థి సంఘాలు నిర్వహించిన సార్వత్రిక సమ్మె కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనంతమయ్య జిల్లా పీలేరులో విజయవంతమైంది. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పీలేరు క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీగా జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. అనంతరం సిట్యూ, సిపిఐ, ఏఐట్యూసీ నాయకత్వం లో కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్, పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య, ఏఐట్యూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. కవిత, బాలాజీ, సురేష్, యశోద, వి.వి.రమణ, బి.వి.రమణ, రమణమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద నగదు రహిత చికిత్సా పథకాన్ని
# ఆంధ్రప్రదేశ్లో అమలు చేయండి..

**రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలవండి..**
**భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**
**సానుకూలంగా స్పందించి, లిఖిత పూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ**
**మోదీ సర్కార్కు ధన్యవాదాలు తెలిపిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు**



**చిత్తూరు (ఢిల్లీ)చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి12:**
చండీగఢ్, అస్సాం, పంజాబ్, ఉత్తరాఖండ్, హర్యానా, పుదుచ్చేరి ఆరు రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలవుతున్న "రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సా పథకాన్ని" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అమలు చేసి, ..రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. ఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు..,గురువారం ఢిల్లీ, లోక్ సభలో "రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకాన్ని" ఆంధ్రప్రదేశ్లో అమలు చేయాలనీ సభకు విన్నవించారు. అంతేకాకుండా ఆ పథకానికి సంబంధించిన సమాచారాన్ని కోరారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ లోక్ సభ ముందుకు తెచ్చిన అంశాలను పరిశీలిస్తే..., గత ఐదు సంవత్సరాలలో నివేదించబడిన రోడ్డు ప్రమాదాల సంఖ్య ఎంత..? అమలు చేయబడిన రోడ్డు ప్రమాద బాధితుల కోసం నగదు రహిత చికిత్స పథకం వివరాలు..?, దాని కింద ప్రయోజనం పొందిన బాధితుల సంఖ్య..?, ప్రభుత్వం అదనపు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెప్పిన నగదు రహిత చికిత్స పథకాన్ని విస్తరించేందుకు ప్రతిపాదిస్తుందా..?, అయితే, అటువంటి విస్తరణకు టైమ్‌లైన్‌లతో సహా దాని వివరాలను కోరగా.., సానుకూలంగా స్పందించిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ.., లిఖిత పూర్వక సమాధానం ఇచ్చినట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు వెల్లడించారు. మోదీ ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టి,ఆరు రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న "రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం".., రోడ్డు ప్రమాద బాధితులకు అండగా నిలుస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ తనకు అందించిన లిఖితపూర్వక సమాధానంలో వివరించినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ తెలిపారు. ప్రమాదం జరిగిన 7 రోజుల్లోనే బాధితుల వైద్యానికి ?1.5 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందించి బాధిత కుటుంబాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందన్నారు. రహదారుల పై సంభవించే అన్ని రకాల మోటారు వాహనాల రోడ్డు ప్రమాదాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 6,840 మంది ప్రయోజనం పొందారని.., అటువంటి రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకాన్ని ఆంధ్రప్రదేశ్లో కూడా అమలు చేయాలని తాను కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలియజేశారు. మోటారు వాహనాల చట్టం, 1988 సెక్షన్ 162 కింద చట్టబద్ధమైన ఆదేశం అనుసరించి, రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం దేశంలోని ఆరు రాష్ట్రాల్లో అమలవుతోందన్నారు. ఈ చట్టబద్ధమైన పథకం ఏదైనా ఇతర కేంద్ర / రాష్ట్ర స్థాయి పథకాల కంటే ప్రాధాన్యతను కలిగి ఉంటుందనీ., ఈ పథకం రెండు ఉన్న టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌ల అమల్గామేషన్ ద్వారా విజయవంతంగా అమలవుతోందన్నారు. ప్రమాదాల నివేదికల కోసం పోలీసు అధికారులు ఉపయోగించే వణూా= (ఎలక్ట్రానిక్ డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్) TMS 2.0 (ట్రాన్సాక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) చికిత్స, క్లెయిమ్ సమర్పణ , చెల్లింపుల ప్రాసెసింగ్ కోసం ఆస్పత్రులు ఉపయోగించే నేషనల్ హెల్త్ అథారిటీ . ఆస్పత్రు లకు రీయింబర్స్‌మెంట్ మోటారు వాహన ప్రమాద నిధి (వీఎూఫీ) ద్వారా జరుగుతోందనీ, ఇది నేరస్థుల మోటారు వాహనం బీమా చేయబడిన సందర్భాలకు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల నుండి, ఇతర-బీమా చేయని సందర్భాలకు బడ్జెట్ మద్దతు ద్వారా అందించబ డుతుందనీ చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.తన అభ్యర్థన ను మన్నించి, తాను కోరిన వివరాలను అందించిన భారత ప్రభుత్వానికి ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# మహిళా శక్తి : భారత పురోగతికి పునాది




భారతదేశ సామాజిక చరిత్రలో మహిళల పాత్రను, వారి సాధనలను, సమానత్వం కోసం సాగిన పోరాటాన్ని స్మరించుకునే ముఖ్యమైన సందర్భాలలో జాతీయ మహిళా దినోత్సవం ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ప్రతి ఏటా ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా భారత సమాజం మహిళా శక్తిని గౌరవిస్తూ, వారి కృషి దేశ నిర్మాణంలో ఎంత కీలకమో గుర్తు చేసుకుంటుంది. ఈ దినోత్సవం కేవలం ఉత్సవంగా మాత్రమే కాకుండా, మహిళల హక్కులు, అవకాశాలు, సవాళ్లు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆలోచనకు ప్రేరేపించే వేదికగా నిలుస్తుంది. భారతదేశం వంటి వైవిధ్యభరిత దేశంలో మహిళల స్థానం, వారి పురోగతి, ఇంకా ఎదుర్కొంటున్న అడ్డంకులు ? ఇవన్నీ ఈ సందర్భంగా విశ్లేషించాల్సిన కీలక అంశాలుగా నిలుస్తాయి. భారతీయ సంస్కృతిలో మహిళను శక్తి స్వరూపిణిగా భావించే పరంపర ఎంతో పురాతనమైనది. వేదకాలంలోనే గార్గి, మైత్రేయి వంటి మహిళలు తత్వచింతనలో విశిష్ట స్థానాన్ని సంపాదించగా, మధ్యయుగాల్లో అనేక సామాజిక ఆంక్షలు మహిళల స్వేచ్ఛను పరిమితం చేశాయి. అయినప్పటికీ, భారత మహిళలు ప్రతి దశలోనూ తమ ప్రతిభను, పట్టుదలను చాటుతూ ముందుకు సాగారు. జాతీయ మహిళా దినోత్సవం ఆ చారిత్రక ప్రయాణాన్ని గుర్తు చేస్తూ, సమాన హక్కుల కోసం జరిగిన ఉద్యమాల ప్రాధాన్యాన్ని వెలుగులోకి తీసుకొస్తుంది. మహిళా విద్య, ఆర్థిక స్వావలంబన, రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలు సమాజ పురోగతికి ఎంత అవసరమో ఈ దినోత్సవం స్పష్టంగా తెలియజేస్తుంది. స్వాతంత్ర్య సమరంలో భారత మహిళల పాత్ర విశేషమైనది. సరోజినీ నాయుడు, అరుణ ఆసఫ్ అలీ, కస్తూర్బా గాంధీ వంటి మహనీయులు దేశ స్వాతంత్ర్యానికి తమ వంతు కృషి చేశారు. వారి త్యాగాలు, నాయకత్వం మహిళల సామాజిక చైతన్యానికి దారితీశాయి. స్వాతంత్ర్యం అనంతరం భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి పునాది వేసింది. అయినప్పటికీ, చట్టపరమైన సమానత్వం ఉన్నప్పటికీ సామాజిక వాస్తవికతలో అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విరుద్ధ పరిస్థితిని సరిచేయడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఆధునిక భారతదేశంలో మహిళలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, వైద్యం, క్రీడలు, రాజకీయాలు, వ్యాపారం వంటి అనేక రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తున్నారు. అంతరిక్ష పరిశోధనలో నుంచి కార్పొరేట్ నాయకత్వం వరకు మహిళల ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య, ఆరోగ్యం, పోషణ, ఉపాధి అవకాశాల విషయంలో ఇంకా అసమానతలు కనిపిస్తున్నాయి. లింగ వివక్ష, బాల్య వివాహాలు, గృహ హింస వంటి సమస్యలు సమాజానికి సవాలుగా మిగిలే ఉన్నాయి. జాతీయ మహిళా దినోత్సవం ఈ సమస్యలను బహిర్గతం చేస్తూ, పరిష్కార మార్గాలపై చర్చకు దోహదం చేస్తుంది. మహిళా సాధికారత అనేది కేవలం ఆర్థిక స్వాతంత్ర్యంతో పరిమితం కాదు; అది సామాజిక గౌరవం, నిర్ణయాధికారం, వ్యక్తిగత స్వేచ్ఛ, భద్రత వంటి అంశాల సమాహారం. మహిళలు కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కృషికి తగిన గుర్తింపు లభించడం చాలా సందర్భాల్లో కష్టసాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ మహిళా దినోత్సవం మహిళల శ్రమను, మేధస్సును, నాయకత్వాన్ని గౌరవించే సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది. మహిళలపై ఉన్న మూఢనమ్మకాలు, సామాజిక పరిమితులను అధిగమించడానికి విద్య, చట్టపరమైన అవగాహన, సామాజిక మద్దతు అత్యంత అవసరం. ప్రభుత్వ విధానాలు మహిళా సంక్షేమానికి కీలకంగా మారాయి. స్వయం సహాయక సంఘాలు, మహిళా ఉపాధి పథకాలు, ఆరోగ్య బీమా కార్యక్రమాలు, బాలికల విద్యను ప్రోత్సహించే పథకాలు మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తున్నాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం కూడా ఒక ముఖ్యమైన ముందడుగు. అయితే, విధానాల అమలు సమర్థవంతంగా జరగకపోతే లక్ష్యాలు నెరవేరవు. అందుకే అవగాహన, పర్యవేక్షణ, సమాజ భాగస్వామ్యం కీలకం. మహిళలపై హింస, వివక్ష వంటి సమస్యలను నిర్మూలించడానికి కేవలం చట్టాలు సరిపోవు; సామాజిక దృక్పథం మారాలి. కుటుంబ స్థాయిలోనే సమానత్వ భావనను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు సానుకూల దిశా నిర్దేశం చేయవచ్చు. పాఠశాల విద్యలో లింగ సమానత్వంపై అవగాహన కల్పించడం, మీడియా ద్వారా సానుకూల సందేశాలు పంపించడం, సమాజంలో ఆదర్శ మహిళల కథనాలను ప్రచారం చేయడం ద్వారా చైతన్యం పెరుగుతుంది. జాతీయ మహిళా దినోత్సవం ఈ దిశగా సమాజాన్ని ఆలోచింపజేసే వేదికగా నిలుస్తుంది. ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తించడం అత్యంత అవసరం. మహిళల ఉపాధి అవకాశాలు పెరిగితే కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా దేశ ఆర్థిక వృద్ధికి కూడా దోహదం చేస్తుంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, సేవారంగం వంటి విభాగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. డిజిటల్ సాంకేతికత మహిళలకు కొత్త అవకాశాలను తెరుస్తోంది. ఆన్‌లైన్ వ్యాపారం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు మహిళల స్వావలంబనకు బాటలు వేస్తున్నాయి. ఈ మార్పులు సమాజంలో మహిళల స్థానాన్ని బలపరుస్తున్నాయి. జాతీయ మహిళా దినోత్సవం ఒక స్మరణిక మాత్రమే కాదు ? అది సమానత్వం, న్యాయం, గౌరవం అనే విలువలను పునరుద్ఘాటించే సామాజిక ఉద్యమం. మహిళల సాధికారత లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. సమాజంలోని ప్రతి వర్గం మహిళల హక్కులను గౌరవిస్తూ, వారికి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలి. కుటుంబం నుంచి ప్రభుత్వ వ్యవస్థల వరకు ప్రతి స్థాయిలో మహిళా భాగస్వామ్యం పెరిగితేనే సమాజం సుస్థిరంగా అభివృద్ధి చెందుతుంది. భారత మహిళల చరిత్ర పోరాటాల, విజయాల, ఆశయాల సమాహారం. ఫిబ్రవరి 13న జరుపుకునే జాతీయ మహిళా దినోత్సవం ఆ చరిత్రను స్మరించుకుంటూ భవిష్యత్తు దిశగా అడుగులు వేయడానికి ప్రేరణనిస్తుంది. మహిళల ప్రతిభకు, శ్రమకు, ఆత్మవిశ్వాసానికి సముచిత గౌరవం లభించినప్పుడే నిజమైన సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. ఈ దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది ? మహిళా సాధికారత అనేది దేశ అభ్యున్నతికి పునాది. మహిళలను గౌరవించే సమాజమే శక్తివంతమైన, సమానత్వభరితమైన భవిష్యత్తును నిర్మించగలదు.

# వాణిజ్య ఒప్పందం భారత్‌కు నష్టమా?

భారత్ అమెరికా యూరోపియన్ యూనియన్ల మధ్య కొన్నేళ్లుగా జరిగిన చర్చలు ఒక కొలిక్కి వచ్చి వాణిజ్య ఒప్పందాలు కుదిరిన పూర్వరంగంలో అవి భారత ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఏ మేరకు తోడ్పడుతాయనే తర్జనభర్జనలు సాగుతున్నాయి. జనవరి 27న 27 దేశాల ఇయుతో ఒప్పందం కుదిరి అంతర్జాతీయ వాణిజ్యంలో కొత్త శకం ప్రారంభమైంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు, ప్రధాని మోడీతో ఫోన్‌లో మాట్లాడినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలుత ప్రకటించగా మోడీ ఆ తర్వాత ధ్రువీకరణ చేశారు. చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని ఈ ఒప్పందాలు వచ్చే ఏడాది ఆరంభంలో అమలులోకి వస్తే మనం ఆ దేశాలకు ఎగుమతి చేసే వస్తువుల ధరలు తగ్గి, గిరాకీ పెరిగి వాణిజ్యం ఇతోధికంగా వృద్ధిచెంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి సత్వర ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు. మన ఎగుమతులలో 20 శాతం అగ్రరాజ్యం అమెరికాకే జరుగుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ అమెరికాను గొప్పదేశంగా చేసేపేరిట ఇన్నాళ్లూ భారత సహా అనేక దేశాలపై ఎడాపెడా సుంకాలు విధిస్తూ ప్రపంచ వాణిజ్య విస్తరణకు అవరోధాలు కల్పించడం, అనిశ్చితి నెలకొనడం తెలిసిందే. ప్రపంచ జిడిపిలో 23% వాటా కలిగి, 200 కోట్ల జనాభాకు ప్రాతినిధ్యం వహించే భారత, 27 యూరోపియన్ దేశాల మధ్య ఇలాంటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం ఏ రకంగా చూసినా పెద్ద ముందడుగు. ట్రంప్ భారత దిగుమతులపై తొలుత 10% ఉన్న సుంకాలను 25 శాతానికి, తదుపరి రష్యాతో చమురు కొంటున్నారనే కుంటి సాకుతో 25 శాతం అదనపు సుంకాలను విధించడం వల్ల అవి 50 శాతానికి పెరిగి మన వస్తువుల ఖరీదు పెరిగి, మహిళలు, శ్రామిక వర్గం అధికంగా పని చేసే రొయ్యలు, చేపలు, తదితర సముద్రపు ఉత్పత్తులు, తోలు ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాల నుండి రొయ్యలు, చేపలు, ఇతర సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావంపడి లక్షలాది మంది మహిళలు, శ్రామికులు ఉపాధి కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్ నుండి 90% రొయ్యల ఎగుమతులు, అదీ అమెరికాకే జరుగుతున్నాయి. వెనెజువె లా చమురు నిల్వల దోపిడీకి ట్రంప్ ఆ దేశం అధ్యక్షుడు మదురోను రహస్య ఆయుధాలు ప్రయోగించి సైనిక విమానాలలో తరలించి అమెరికాలో నిర్బంధించారు. ఇప్పుడు ఆ చమురును భారత్‌కు అమ్మజూపుతున్నారు. డెన్మార్క్ అధీనంలోని గ్రీన్‌లాండ్‌ను బలప్రయోగంతో స్వాధీనం చేసుకోవడానికి చేసిన యత్నాలను, అదనంగా 10% దిగుమతి సుంకం విధించడాన్ని డెన్మార్క్ ప్రభుత్వం, నాటో కూటమి సభ్యదేశాలు తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిఘటించడంతో ట్రంప్ తోకముడవక తప్పలేదు.

ఇన్నాళ్లు నాటో కూటమి సభ్యదేశాలుగా అమెరికాకు వంతపాడినా తమపై కూడా ట్రంప్ బెదిరింపులకు దిగడంతో ఇయు దేశాలు 145 కోట్ల జనాభాతో పెద్ద మార్కెట్‌గా ఉన్న భారతతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. అమెరికా పెత్తందారీ, బెదిరింపు వైఖరి వల్ల భారతదేశం కూడా మన ఉత్పత్తులకు అనువైన ప్రత్యామ్నాయ మార్కెట్ల కోసమే ఇయుతో ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. చైనా చవక ఉత్పత్తులు వచ్చి పడుతున్న వేళ ధరలు తగ్గడానికి ఈ స్వేచ్ఛా వాణిజ్యం ఉభయులకు శ్రేయస్కరమని నేతలు భావిస్తున్నారు. 200 బిలియన్ డాలర్ల వాణిజ్యంతో ఇయు భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. వస్తు సేవల వాణిజ్య శేషం భారత్‌కు అనుకూలంగా ఉంది. దాదాపు 98% వాణిజ్యం సుంకాలులేకుండా స్వేచ్ఛగా జరగడం వల్ల భారత ఉత్పత్తుల ధరలుతగ్గి గిరాకీ మరింత పెరిగి దేశీయంగా వస్త్ర పరిశ్రమ, రెడీమేడ్ దుస్తులు, తోలు, సముద్ర ఉత్పత్తుల పరిశ్రమల్లో మన మహిళలు, శ్రామికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత పెరిగి ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. భారీ జనాభాతో మొదటి స్థానంలో ఉన్న భారత్‌లో మధ్య తరగతి, ఉన్నత వర్గాల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నందున చాక్లెట్‌లు, బిస్కెట్‌లు, పాస్తా, పేస్ట్రీలు తదితర ఉత్పత్తులను సుంకం లేకుండా అనుమతి ఇస్తారు. వివిధ రకాల కార్లపై ప్రస్తుతం ఉన్న 110% ఉన్న దిగుమతి సుంకాలను భారత్ క్రమేణా 10 శాతానికి తగ్గిస్తుంది. ధరలు తగ్గి విదేశీ కార్లకు, మద్యానికి గిరాకీ పెరగవచ్చు. అది ఉన్నతవర్గాలకు ఉపయోగం. గత ఏడాది జులైలో బ్రిటన్ భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ఇంకా అమలు కాలేదు. అందువల్ల 27 ఇయు దేశాలు ఆమోదించాకే ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది. అందుకు దౌత్యపర కృషి అవసరం. మిషన్- 500 పేరుతో 2030 నాటికి భారత అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలనే ప్రయత్నాలు ఇప్పుడు అమలు కావచ్చు. మొక్కజొన్న, సోయాబీన్ తదితర వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా కొనడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ చెప్పగా, వ్యవసాయ, పాడి పరిశ్రమల ఉత్పత్తులను అనుమతించ్బోమని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేసినా, నాలుగైదు రోజుల్లో అసలు ఒప్పందం వెలుగులోకి వస్తేగానీ అది దేశానికి మేలు చేస్తుందా లేక అమెరికా దిగుమతులు సున్నా సుంకాలతో కుప్పతెప్పలుగా వచ్చి చేటు చేస్తాయా అనేది తేలుతుంది. అమెరికా 18% సుంకాలు విధిస్తున్న తరుణంలో మనం సున్నా సుంకాలను అనుమతించడం అమెరికా బెదిరింపులకు భయపడి లొంగిపోవడమేనని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేయగా లోక్‌సభ పదేపదే వాయిదా పడింది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సమాధానం ఇవ్వకుండా ప్రధాని మోడీ దాటవేయడం, మహిళా ఎంపిలు దాడి చేసే ప్రమాదం ఉందని, సభకు రావద్దు అని స్పీకర్ ప్రధానికి చెప్పడం శోచనీయం. పార్లమెంటులో ప్రధానికే రక్షణ కల్పించలేని ఎన్‌డిఎ ప్రభుత్వం దేశప్రజలను ఏమి రక్షిస్తుందని ప్రతిపక్షాలు నిగ్గ దీశాయి. భారత- ఇయు ఒప్పందం దరిమిలా దుందుడుకు వైఖరివల్ల ఏకాకిగా మారుతున్న అమెరికా వారం రోజుల్లో భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడం గమనార్హం. అమెరికా, ఇయు దేశాల కఠిన నియంత్రణా విధానాలు, భారత ఉత్పత్తులపై, మొక్కలు, పశువులకు సంబంధించిన నిబంధనలు అమలులో అవరోధ కారణాలు కావచ్చు. ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, పరిశ్రమల నుండి వెలువడే బొగ్గ పులుసు వాయువులు, కార్బన్ బోర్డర్ నియమ నిబంధనలున్నాయి. ఈ కాలుష్యాన్ని నివారించడానికి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడానికి మరిన్ని పెట్టుబడులు కావాలి. అయితే భారత్, ఇయు దేశాలు విలువ గొలుసులో వేర్వేరు స్థాయిల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఉత్పత్తి కార్యకలాపాలలో విరుద్ధ అంశాలు లేవు. ఉభయులూ ఎవరి పరిశ్రమల్లో ఉత్పాదకశక్తి, నాణ్యత పెంచుకోవచ్చు. ప్రపంచంలో అమెరికా పెద్ద ఆర్థిక వ్యవస్థ కాగా, ఇయు రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ. భారత్‌ది 4వ పెద్ద ఆర్థిక వ్యవస్థ. భారత్‌లో కోట్లాది మంది జీవితాలతో ముడిబడ్డ సేద్యం, పాడి పరిశ్రమ, కోళ్ల ఉత్పత్తులను, ఆహార ధాన్యాలను ఈ ఒప్పందాలలో చేర్చలేదని పాలకులు చెప్పడంలో నిజమెంతో అమలులోకి వచ్చాక తెలుస్తుంది. యూరప్ దేశాలనుండి అత్యాధునిక యంత్రా లు, వైద్యపరికరాలు, మందులు, సుంకాలు తగ్గి భారతీయులకు అందుబాటులోకి రావడం, ఆస్పత్రుల చికిత్సా రంగానికి, ప్రజారోగ్యం రంగాలకు మేలు. భారత చరిత్రలో ఇది అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమనీ, అన్ని వాణిజ్య ఒప్పందాలకు మాతృక అని ప్రధాని మోడీ అభివర్ణించారు. కొత్త ఢిల్లీలో జరిగిన భారత ఇయు 16 వ అగ్రనాయక సభకు మోడీ, ఇయు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వన్ దెరిలియన్ ఇయు కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అధ్యక్షత వహించారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143